క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు


పూజలందుకుంటున్న అమ్మవారు

ఎచ్చెర్ల : మండలంలోని కుంచాలకుర్మయ్యపేటలో గాయిత్రీదేవి అమ్మవారికి బుధవారం కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బచ్చు నర్సింగరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

123 ఉపాధి పనులకు పరిపాలన ఆమోదం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో 26 గ్రామ పంచాయతీలకు 123 ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ పనులకు పాలనా అనుమతులు మంజూరైనట్లు ఎంపీడీవో సీపాన హరిహరరావు చెప్పారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రూ.7.74 కోట్లు అంచనా విలువతో త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

నేత్రదానానికి ముందుకురండి

శ్రీకాకుళమ కల్చరల్: నేత్రదానానికి ప్రతిఒక్కరూ ముందుకురావాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. చీపురుపల్లి మండలం జి.అగ్రహారంలో నివాసముంటున్న లంకపల్లి ఆదిబాబు(84) అనారోగ్యంతో మృతిచెందడంతో నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఆయన కుమారుడు శ్రీనివాసరావు రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ బి.వి.గోవిందరాజులుకు సమాచారం అందించారు. నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి పి.సుజాత, నంది ఉమాశంకర్‌లు వెళ్లి ఆదిబాబు కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబసభ్యులకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, సభ్యులు దుర్గాశ్రీనివాస్ అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరును సంప్రదించాలని కోరారు.

అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు


బలగలో అయ్యప్పస్వామికి పూజలు


శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్ప దేవాలయంలో బుధవారం స్వామికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు పాల్గొన్నారు. పాత శ్రీకాకుళంలోని ధర్మశాస్తా దేవాలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు తప్పనిసరి


మాట్లాడుతున్న ఈఈ యోగేశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యుత్‌ను పొదుపుగా వాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పైడి యోగేశ్వరరావు అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్‌లో బుధవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ ఆదాపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ విద్యుత్‌ను వృథా చేయకూడదన్నారు. లైట్లు, ఫ్యాన్లు అనవసరంగా వాడకూడదని చెప్పారు. ఏసీలను వేసవికి మాత్రమే పరిమితం చేయాలన్నారు. ప్రమాదాల నియంత్రణ, విద్యుత్ ఆదా కోసం ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లు, మోషన్ సెన్సార్లు, ఆటోమెటిక్ టైమర్లు, డిమ్మర్లు, సోలార్ సెల్‌లు ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తినాయుడు, ప్రొఫెసర్ వి.కె.చక్రవర్తి, విద్యుత్ శాఖ ఈఈ టెక్నికల్ జి.సురేష్‌కుమార్, డీఈఈ యు.వి.రమణమూర్తి, ఈఏ ఎస్.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాభివృద్ధి


మాట్లాడుతున్న మీసాల వెంకటరమణ

జి.సిగడాం: పల్లెలు అభివృద్ధి అందరి సహకారం అవసరమని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ అన్నారు. బుధవారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగుకు అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ గుంట ముక్కల రామకృష్ణారావు, డీఆర్‌పీలు ఏర్నేన జ్యోతిశ్రీనివాస్, రాజా రమేష్, తులసీ ప్రసాద్ సాహు, జాడ వెంకటన్నాయుడు, పి.సురేష్‌కుమార్, వడగా గౌరీశంకరావు పాల్గొన్నారు.

- ఆకాశాన్నంటుతున్న కూరగాయలు, నిత్యావసరాల ధరలు
- పెరగని మెనూ చార్జీలు
- ఎండీఎం కార్మికులకు తప్పని అవస్థలు

మధ్యాహ్న భోజనానికి.. ధరల సెగ


పిల్లలకు భోజనాలు వడ్డిస్తున్న ఎండీఎం కార్మికులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సర్కారీ బడుల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి ధరల సెగ ఎక్కువైంది. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు, హాజరు శాతం పెంచేందుకు అమలు చేస్తున్న ఈ పథకంపై కూటమి సర్కారు దృష్టి సారించకపోవడం, ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచకపోవడం భోజన కార్మికుల పాలిట శాపంగా మారింది. దీనికితోడు గౌరవ వేతనం సక్రమంగా చెల్లించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

గతంలో నాణ్యమైన పౌష్టికాహారం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులను బడులకు చేరువ చేసేలా జగనన్న అమ్మ ఒడి పథకం, ఇంగ్లీషు మీడియం చదువులు, సీబీఎస్సీ సిలబస్‌లు, ట్యాబ్‌లు పంపిణీ, టోఫెల్ శిక్షణ, బైలాంగ్వల్ పాఠ్యపుస్తకాలు, మనబడి నాడు నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చారు. ముఖ్యంగా ఆరోగ్యవంతమైన పౌష్టికాహారంతో కూడిన ఆహారాన్ని అందించే వారు. అప్పట్లో తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడులకు పంపేందుకు ఎంతో ఆసక్తి చూపేవారు. దాదాపు శతశాతం మంది విద్యార్థులు బడుల్లోనే భోజనాలు చేసే పరిస్థితులుండేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో నిత్యావసరాలతో పాటు అన్ని రకాల ధరలూ ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో ఏజెన్సీ నిర్వాహకులకు మధ్యాహ్న భోజనం వంట భారంగా మారింది. కొందరు అప్పులు చేసి పిల్లలకు భోజనాలు వండి పెడుతున్నారు. బిల్లులు సకాలంలో అందక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. ఫలితంగా రుచికరమైన, నాణ్యమైన భోజనం పిల్లలకు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం కూడా ఎండీఎం పథకాన్ని అంత సీరియస్‌గా తీసుకోకపోడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మెనూ ప్రకారమే కానీ..

సోమవారం నుంచి శనివారం వరకు అన్నంతో పాటు పప్పుచారు, పులిహోరా, టమాటా, వెజిటబుల్ రైస్, ఆకుకూరలు, సాంబారు, కూరగాయలు, స్వీట్ పొంగల్ వంటి పదార్థాలను వంట నిర్వాహకులు విద్యార్థులకు వండిపెడుతున్నారు. శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలో మొత్తం 218 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 18430 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా భోజనాలు వస్తున్నప్పటికీ.. గుడ్లు, భోజనాలు వడ్డించడం ఇతరత్ర పనులకు భోజన కార్మికులే ఆధారం. ఎచ్చెర్ల నియోజకవర్గంలో 368 వరకు పాఠశాలల్లో ఎండీఎం పథకాన్ని అందిస్తున్నారు. వీటిల్లో 710 మంది వరకు మధ్యాహ్న బోజనాలు వండుతున్నారు. ప్రాథమిక పాఠశాల్లో ఒక్కో విద్యార్థికి రూ.5.88 పైసలు చొప్పున, ఉన్నత పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి రూ.8.57 పైసలు చొప్పున నిర్వాహకులకు అందిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అందజేసిన బిల్లులు ఇవి. కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు కావొస్తున్నా, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నా మెనూ చార్జీల్లో ఇంకా ఎలాంటి పెంపు జరగలేదు.


మధ్యాహ్న భోజనం తింటున్న బాలికలు

వేతనాలు పెంచలేదు..

రోజురోజుకు నిత్యావసరాల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. వంట ఏజెన్సీలకు గౌరవ వేతనం రూ.3 వేలు ఇస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలల్లోనే ఉండాల్సి వస్తుంది. మాకు వేతనాలు పెంచి సకాలంలో అందజేయాలని కోరుతున్నాం.

– బి.భూలక్ష్మి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

ధరల భారం..

నిత్యావసర ధరలతో పాటు అన్ని రకాల కూరగాయలు, సామగ్రి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మధ్యాహ్న భోజనంలో పిల్లలందరికీ వంట చేయడం భారంగా మారింది. బిల్లులు కూడా సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నాం.

– ఎం.సత్యవతి, మధ్యాహ్న భోజన నిర్వాహకులు

రోలర్ స్కేటింగ్‌లో రమ్యశ్రీ ప్రతిభ



శ్రీకాకుళం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మూడవ సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న ఆర్.వి.రమ్యశ్రీ ఇటీవల కోయంబత్తూరులో జరిగిన 62వ జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్-2024లో కాంస్య పతకం సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ రవి వెంకటాచలం తెలిపారు. ఈ సందర్భంగా రమ్యశ్రీని ప్రిన్సిపాల్, అధ్యాపకులు బి.గౌరీనాయుడు, జి.ప్రసన్న, ఎస్.నరసింహామూర్తి, బి.జోగబ్ బుధవారం అభినందించారు. – శ్రీకాకుళం

పేదలకు వస్త్రదానం



శ్రీకాకుళంలోని తెలుగు బాప్టిస్టు చర్చి రెండవ ఆరాధన కమిటీ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుమారు 150మంది లెప్రసీ బాధితులకు వస్త్రాలు, భోజన ప్యాకెట్లు, 20 మంది యాచకులకు రేషన్, రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ ఎమ్మెస్సీ శేఖర్, ప్రెసిడెంట్ ఆనంద్ రత్నకుమార్, ట్రెజరర్ పి.సునీల్, సంఘ కాపరి ఆర్.అశోక్‌కుమార్ పాల్గొన్నారు. – శ్రీకాకుళం కల్చరల్

21న వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఈ నెల 21న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శ్రీకాకుళంలోని రామలక్ష్మణ కూడలి వద్ద మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉదయం 8.30 గంటలకు హోమం నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 9.30 గంటలకు కేక్ కటింగ్, 10.30 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రి (రిమ్స్)లో రోగులకు పండ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చైతన్య స్ఫూర్తి 'గరిమెళ్ల'


మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమారరాజు

శ్రీకాకుళం కల్చరల్: ప్రజాకవి గరిమెళ్ల సత్యనారాయణ చైతన్య స్ఫూర్తిగా నిలుస్తారని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమారరాజు అన్నారు. కేంద్ర గ్రంథాలయంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వి.జి.కె.మూర్తి అధ్యక్షతన గరిమెళ్ల వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గరిమెళ్ల మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి బాడాన రాజు మాట్లాడుతూ సాహితీవేత్తగా గరిమెళ్లకు ప్రభుత్వాలు సరైన గుర్తింపునివ్వలేదన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గరిమెళ్ల మనమడు అశోక్ లక్ష్మణ్, ఎం.ప్రభాకరరావు, పి.సుధాకరరావు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి


శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్


ఎచ్చెర్ల: బుడుమూరులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ: వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని, బిల్లులను భద్రపరచాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు అన్నారు. డిజిటల్ ప్రపంచంలో వినియోగదారులు వివిధ కంపెనీలు, సంస్థల మోసపూరిత ప్రకటనలతో మోసపోతున్నారని గుర్తుచేశారు. కళాశాలలో బుధవారం వాణిజ్యశాస్త్రం, అర్థశాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. వాణిజ్యశాస్త్రం విభాగాధిపతి లబ్బ కృష్ణారావు విద్యార్థులతో వినియోగదారుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అర్థశాస్త్రం అధ్యాపకురాలు ఆదిలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర్‌నారాయణ, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.పద్మావతి, సీహెచ్ కృష్ణారావు, లలితాభాయ్, సంతోషి, పావని తదితరులు పాల్గొన్నారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి..

ఎచ్చెర్ల : వినియోగదారుల రక్షణ చట్టం–2019 స్ఫూర్తిని, లక్ష్యాన్ని అర్థం చేసుకుని చట్టం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని బుడుమూరు ఉన్నత పాఠశాల కో–ఆర్డినేటర్ పూజారి గోవిందరావు అన్నారు. పాఠశాలలో ప్రార్థనా సమయంలో విద్యార్థులతో వినియోగదారుల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉరిటి శ్రీనివాసరావు, పడాల తమ్మినాయుడు, సీర రమేష్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు


మాట్లాడుతున్న ఎస్ఐ జనార్దనరావు

గార: మత్తు పదార్థాలకు యువత బానిసకావొద్దని, జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలని ఎస్ఐ రెల్ల జనార్దనరావు అన్నారు. వమరవల్లి పంచాయతీ గొర్లెవానిపేటలో సంకల్పంలో భాగంగా యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మద్యం కలిగి ఉన్నా అరెస్టులు చేస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. డిజిటల్ అరెస్ట్ అంటూ వస్తున్న ఫోన్లను నమ్మవద్దన్నారు. మోసానికి గురైతే మొదటి గంటలోగా పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు.

అపరాల సాగు లాభదాయకం


అవగాహన కల్పిస్తున్న ఏఓ శారద

జి.సిగడాం : రైతులు అపరాల పంటలు సాగు చేసుకుంటే లాభదాయకమని మండల వ్యవసాయాధికారి యర్రా శారద అన్నారు. బుధవారం మండల కేంద్రం జి.సిగడాంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు సమీరా, అలుగోలు లక్ష్మీనారాయణ, కుమరాపు సుగుణాకరరావు, రాణి, అనూషా, సంతోష్, యుగంధర్, హరికృష్ణ, హరీష్ పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ ఉద్యోగాలకు పాలఖండ్యాం విద్యార్థుల ఎంపిక


రమ్య


నరేష్


మణికంఠ

జి.సిగడాం: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఇటీవల విడుదల చేసిన ఉద్యోగ ఫలితాల్లో పాలఖండ్యాం విద్యార్థులు సత్తాచాటారు. బీఎస్ఎఫ్ విభాగంలో కానిస్టేబుల్‌గా శిర్రా రమ్య, సీహెచ్ మణికంఠ, ఎస్ఎస్‌బీ కానిస్టేబుల్‌గా పలిశెట్టి నరేష్ ఎంపికయ్యారు. వీరంతా సాధారణ వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారే. వీరి ఎంపిక పట్ల సర్పంచ్ ధారబోయిన రెయిమ్మ, మాజీ సర్పంచ్ పలిశెట్టి సూర్యనారాయణ, నీటిసంఘం అధ్యక్షుడు పులప శ్రీనివాసరావు, అరుణోదయ విద్యాసంస్థ అధినేత గర్లంకి శ్రీనివాసరావు, ధర్మరాజ్, సత్యారావు హర్షం వ్యక్తం చేశారు.

దళిత సంఘాల నాయకుల నిరసన


కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల జేఏసీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై పార్లమెంట్ వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై సుప్రీం కోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి బర్తరఫ్ చేయాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం శ్రీకాకుళంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి బోనెల అప్పారావు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నగర అధ్యక్షుడు కానుకూర్తి గోవింద్, దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా నాయకులు బైరీ ధనరాజ్, సూరిబాబు, ముచ శ్యామ్, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు రాకోటి రాంబాబు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.జగన్నాథం, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి రాంగోపాల్, బడే కామరాజు, రమేష్, మురళీకృష్ణ, జాన్, ఎడ్ల జానకిరావు, బోసు మన్మధరావు, యజ్జల గురుమూర్తి, బొడ్డేపల్లి భూపతిరావు తదితరులు పాల్గొన్నారు.

20న చిన్నయసూరి జయంతి ఉత్సవాలు


గ్రంథాలయంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

రణస్థలం: విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో ఈ నెల 20న జరిగే పరవస్తు చిన్నయసూరి 218వ జయంత్యుత్సవ కార్యక్రమాలు విజయవంతం చేయాలని శ్రీకాకుళం చిన్నయసూరి సాహితీ పీఠం ఫౌండర్ తాళ్లూరి విజయ్ లక్ష్మణ్, ఇడదాసుల విద్య ఆరోగ్య ఫౌండేషన్ అధ్యక్షుడు ఇ.తిరుపతిరాజు, వేమన కవితా నిలయం అధ్యక్షుడు మహ్మద్ రఫీ(ఈవేమన) పిలుపునిచ్చారు. బుధవారం రణస్థలంలోని ఇడదాసుల గ్రంథాలయంలో ఉత్సవ బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, కవులు, రచయితలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు, ఆహారం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పాలకొండ, రాజాం, సీతంపేట వంటి గిరిజన ప్రాంతాల్లో రూపాయికే వైద్యం అందించిన సేవాతత్పరుడు డాక్టర్ ఎస్.పి.నాయుడు అని మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి అన్నారు. ఎస్పీ నాయుడు 70వ జయంతి సందర్భంగా ఆయన సతీమణి సనపల సత్యవతి ఆధ్వర్యంలో కొత్తబ్రిడ్జి రోడ్డులో ప్రవేటు కళ్యాణ మండపంలో బుధవారం నిరుపేదలకు దుప్పట్లు, ఆహారం అందజేశారు. అనంతరం ఫాజుల్‌బేగ్‌పేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, డాక్టర్ శ్రీజ, సూర శ్రీను, నటుకుల మోహన్, బాడాన దేవభూషణరావు, మెట్ట జగ్గు, భట్లు, బుడుమూరు శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

29న తూర్పుకాపుల ఆత్మీయ కలయిక


సమావేశంలో పాల్గొన్న తూర్పుకాపు సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎచ్చెర్ల వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 29న తూర్పుకాపు సామాజికవర్గం ఆత్మీయ కలయిక సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా తూర్పు కాపు సామాజికవర్గం ప్రతినిధులు తెలిపారు. బుధవారం నగరంలోని ఓ ప్రయివేటు భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని తూర్పు కాపు సామాజికవర్గం ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. తూర్పుకాపు యువత, మహిళలు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు డోల జగన్‌మోహన్, సురంగి మోహనరావు, శాసపు జోగినాయుడు, ఇజ్జాడ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.రామజోగినాయుడు, కిల్లారి నారాయణరావు, అంకడాల తవిటన్న, డోల బాలకృష్ణ, ఎం.ప్రభాకర్, కురిటి దుర్గారావు, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తనిఖీ


పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీవో రూన్సీబాయి

రణస్థలం: ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ల పంపిణీలో అవినీతి జరిగిందా లేదా అనే విషయం తెలుసుకునేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ పీవో రూన్సీబాయి తెలిపారు. కొండములగాంలో బుధవారం పింఛన్ల తనిఖీ చేపట్టారు. వనుము పెంటమ్మ అనే వితంతువు పింఛన్ పంపిణీలో అవినీతి జరిగిందని సర్వేలో వెల్లడించడంతో వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు పరిశీలన చేపట్టారు. తాను గత ఏడాది ఆగస్టు నుంచి పింఛన్ అందుకుంటున్నానని, పింఛన్ పంపిణీ సమయంలో ఎవరికీ డబ్బులు ఇవ్వలేదని, పొరపాటున సర్వేలో అవును అని బటన్ నొక్కినట్లు ఆమె స్పష్టం చేశారు. పరిశీలనలో వెల్ఫేర్ అసిస్టెంట్ రమణయ్య పాల్గొన్నారు.

రజతోత్సవం విజయవంతం


మాట్లాడుతున్న సమాఖ్య అధ్యక్షుడు వెంకటరావు

శ్రీకాకుళం కల్చరల్: రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం రజతోత్సవం వేడుకలు విజయంతంగా ముగిశాయని, సహకరించిన అందరికీ ధన్యవాదాలని సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వెంకటరావు అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం కళాకారుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక ప్రదర్శనల నిర్వహణకు సహకరించిన దాతలకు సమాఖ్య తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సమాఖ్య కార్యదర్శి రామచంద్రదేవ్, కార్యనిర్వాహక అధ్యక్షులు పన్నాల నర్సింహమూర్తి, బి.ఎస్.భూషణ్, కలగ గణేష్‌యాదవ్, పొట్నూరు వెంకటరావు, కంచరాన అప్పారావు, మెట్ట వెంకటరాజు, పోలినాయుడు, సింహాచలం, కె.శాంతారాం, ఎల్.నందికేశ్వరరావు, సొంగలి గణేష్, బీఎంఎస్ పట్నాయిక్, కంచరాన అప్పారావు, పైడి సత్యవతి, జ్యోతి, శారద తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మైనారిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మైనారిటీ దినోత్సవం సందర్భంగా ప్రేయర్ ఫెలోషిప్ చర్చిని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ రాజ్యాంగానికి లోబడి హక్కులు పొందుతూ బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజయగణపతికి విశేష పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో బుధవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.